బాలికలదే భవిష్యత్

- సమాజానికి వారే ప్రతినిధులు
- జాతీయ బాలికా దినోత్సవంలో సూపర్‌వైజర్ కుసుమ కుమారి


ఈతముక్కలో ర్యాలీ నిర్వహిస్తున్న కుసుమ కుమారి

ఈతముక్కల (కొత్తపట్నం): సమాజానికి బాలికలే ప్రతినిధులని, భవిష్యత్ వారి చేతుల్లోనే ఉందని ఈతముక్కల సెక్టార్ సూపర్‌వైజర్ టి.కుసుమ కుమారి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఈతముక్కల అంగన్‌వాడీ సెక్టార్ పరిధిలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. హైస్కూల్ విద్యార్థులచే బస్టాండ్ కూడలి వరకు, అంబేడ్కర్ విగ్రహం నుంచి పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. కుసుమా కుమారి మాట్లాడుతూ బాలికలకు కూడా సమాన హక్కులు ఉన్నప్పటికీ, పురాతనం నుంచి వస్తున్న కట్టుబాట్లు, ఆంక్షలు, మూఢ నమ్మకాల వలన తీవ్ర వివక్షత ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికీ కొన్ని మారు మూల ప్రాంతాల్లో బాలికలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో బాలికలు రాణించేందుకు తమ ప్రోత్సాహం ఎప్పుడూ ఉంటుందన్నారు. బాలికలు అన్ని రంగాల్లో భాగస్వాములు కావాలంటే ఒకే ఒక ఆయుధం విద్య అన్నారు. హెచ్‌ఎం శివయ్య, ఉపాధ్యాయుడు సుప్రజ, విద్యార్థులు పాల్గొన్నారు.

కొప్పోలులో బాలికా దినోత్సవ ర్యాలీ

ఒంగోలు సబర్బన్: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొప్పోలులో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ ఒంగోలు సక్టార్ పరిధిలోని కొప్పోలులో నిర్వహించిన ర్యాలీలో 10వ డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ బెంగుళూరు నర్సయ్య పాల్గొన్నారు. ర్యాలీతో పాటు కొప్పోలులో చిన్నారులతో మానవహారం కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జాతీయ బాలికా దినోత్సవం ప్రాధాన్యతను కార్పొరేటర్ నర్సయ్య వివులీకరించారు. సూపర్‌వైజర్ పి.సరోజిని, స్కూలు టీచర్ శేషిరెడ్డి, కిశోర బాలికలు, సచివాలయ సిబ్బంది, సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంగోలు టౌన్: లింగవివక్షను రూపు మాపేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు బి.పద్మావతి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఏకేవీకే జూనియర్ కళాశాల, బండ్లమిట్టలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ బాలికా వారోత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆడబిడ్డను రక్షిద్దాం, ఆడబిడ్డను గ్రతకనిద్దాం, ఆడబిడ్డను చదవనిద్దాం అని అన్నారు. పిల్లల్లో విద్యార్థి దశ నుంచే బాలల హక్కుల గురించి అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా బాలల సంరక్షణాధికారి పి.దినేష్, సిడబ్ల్యూ మెంబర్ డి.నీలిమ తదితరులు పాల్గొన్నారు.


బండ్ల మిట్ల పాఠశాలలో ప్రసంగిస్తున్న బి.పద్మావతి

డీఎస్ డిగ్రీ కాలేజీలో....

చదువులతో పాటుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని డీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి అన్నారు. మంగళవారం కళాశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఉద్యోగ జీవితంలో రాణించాలంటే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. వివిధ రంగాల్లో అద్భుత విజయాలను సాధించిన ఎందరో మహిళ జీవితాలను అధ్యయనం చేయాలన్నారు. భవిష్యత్తు మహిళలదే అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.ఇందిరా దేవి, యామిని అమ్మాజీ, సుష్మ, సరళ తదితరులు పాల్గొన్నారు.

పేస్ కాలేజీలో..

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉమన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఎలక్యూషన్, డిబేట్‌లను నిర్వహించారు. బాలికా విద్య, సమానత్వం, సాధికారత, బాలికా విద్య బలోపేతం వల్ల దేశం ఆర్థికంగా ఎలా బలోపేతం అవుతుందనే అంశంపై సెమినార్ నిర్వహించారు. విజేతలకు కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవి మూర్తి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ వీరాంజనేయులు తదితరులు ప్రశంస పత్రాలు అందించారు.

బాలికల హక్కులకు అండగా నిలవాలి

చీమకుర్తి: బాలికల హక్కులను కాపాడుతూ వారికి అండగా నిలవాలని సంతనూతలపాడు జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, ప్రధానోపాధ్యాయులు పి.రామారావు పిలుపునిచ్చారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం సంతనూతలపాడు జిల్లాపరిషత్ హైస్కూలులో బాలికలు, టీచర్‌లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ జాతీయ బాలికా దినోత్సవం అంటే బాలికల హక్కులను కాపాడటంతో పాటు ఉన్నతమైన భవిష్యత్‌కు భరోసాను కల్పించటమన్నారు. 2008లో మహిళా శిశు మంత్రిత్వ శాఖ చొరవతో ప్రతి ఏడాది జనవరి నెల 24న నేషనల్ గర్ల్‌చైల్డ్ డే కార్యక్రమాన్ని నిర్వహించటం ఆనవాయితీగా వస్తోందన్నారు.

నాగులుప్పలపాడు: సమాజానికి అమృతనాన్ని అందించే బాలికలను కాపాడుకోవడంలోనే భవిష్యత్ ముడిపడి ఉందని సూపర్‌వైజర్ శివనాగరాజ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నాగులుప్పలపాడు లో నిర్వహించిన అవగాహన ర్యాలీలో చిన్నారుల చేత ఆలోజింపచేసే ప్లకార్డులను ప్రదర్శించారు.


ప్రశంసపత్రాన్ని అందిస్తున్న పేస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి


సంతనూతలపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న టీచర్లు, బాలికలు


నాగులుప్పలపాడులో ర్యాలీ చేస్తున్న బాలికలు

క్లుప్తంగా

ఎంపీ మాగుంట రాక రేపు

ఒంగోలు: ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈనెల 26న నగరంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతో బాటు ప్రజలకు, పార్టీ నాయకులు, అభిమానులకు అందుబాటులో ఉంటారని ఒంగోలు ఎంపీ కార్యాలయ ప్రతినిధి భవనం సుబ్బారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు నగరపాలక సంస్థ కార్యాలయంలో, 8.45 గంటలకు ఒంగోలు పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే 74వ గణతంత్ర దినోత్సవ కార్యక్రమానికి హాజరవుతారు. 11గంటలకు సాయిబాబా గుడి వద్ద కాలే వెంకటేశ్వర్లు పూజ కంప్యూటర్ ఎడ్యుకేషన్ రెండో బ్రాంచి ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు కలెక్టరేట్లో హైటీ కార్యక్రమానికి బాలినేని హాజరవుతారు.

శనగ సాగుపై మెళకువలు


ఎండ్లూరులో శనగ పంటపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయధికారులు

చీమకుర్తి: శనగ పంట సాగులో అవసరమైన మెళకువల ద్వారా అధిక ఉత్పత్తిని సాధించవచ్చని సంతనూతలపాడు మండల వ్యవసాయాధికారి పావని రైతులకు తెలిపారు. మంగళవారం ఎండ్లూరులో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో అవగాహన కల్పించారు. ఎర పంటగా పొలంలో బంతి పూల చెట్లను పెంచటం, లింగాకర్షక బుట్టల ఏర్పాటు, పక్షి స్థావరాలను నిర్మించటం వంటి విధానాల వలన క్రిమిసంహారక మందుల వాడకం తగ్గిపోతుందన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


షటిల్ పోటీలను ప్రారంభిస్తున్న బ్యాంక్ మేనేజర్ నవనీత్ కుమార్

నాగులుప్పలపాడు: ప్రస్తుత బిజీ కాలంలో ప్రతి మానవునికి క్రీడలు శారీరక ధృడత్వంతో పాటు మానసికోల్లాసం కలిగిస్తాయని ఉప్పుగుండూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ నవనీత్ కుమార్ అన్నారు. గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాసవి క్లబ్ మరియు షటిల్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు గ్రామంలో జరుగుతున్న ఓపెన్ షటిల్ బ్యాట్మింటన్ పోటీలను ప్రారంభించిన మేనేజర్ మాట్లాడుతూ ఈ పోటీలలో పాల్గొనే ప్రతి క్రీడాకారుడు అత్యుత్తమ ప్రతిభ కనబరచి విజేతలుగా నిలవాలని కోరారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షులు కొంజేటి సురేష్, ఎంపీటీసీ మున్నంగి వెంకట్రావు, తెలగతోటి శ్యామ్యూల్, దేసు రవి సుధాకర్, పిడి అంకమ్మరావు, ప్రదీప్ తదితరులు ఉన్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

వలేటివారిపాలెం: చెట్టుపై నుంచి కింద పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన అత్తంటివారిపాలెంలో మంగళవారం చోటు చేసుకుంది. అత్తంటివారిపాలెం గ్రామానికి చెందిన నడిపినేని రమేష్ (39), నడిపినేని గోవిందయ్య చింత చెట్టు కొడుతున్న సమయంలో కొమ్మ విరిగి ప్రమాదవశాత్తు కింద పడి చనిపోయాడు. రమేష్ తండ్రి మాల కొండయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై సుదర్శన్ యాదవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

27న బైక్ వేలం

సింగరాయకొండ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 27వ తేదీన ఉదయం 11 గంటలకు ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు పర్యవేక్షణలో 2018 మోడల్ హీరోహోండా బైక్ వేలం వేయనున్నట్లు ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా తెలిపారు. ఔత్సాహికులు వేలంలో పాల్గొనాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

శివం ఫౌండేషన్ సేవలు అభినందనీయం


విద్యార్థులకు నగదును అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, హరి

చీమకుర్తి: దాతల సహకారంతో శివం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండర్ గొల్లపూడి శ్రీహరి అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం చీమకుర్తిలోని మండల పరిషత్ కార్యాలయంలో శివం ఫౌండేషన్ ద్వారా అందించిన రూ.52 వేల నగదును ఎంపీపీ, జెడ్పీటీసీ చేతుల మీదుగా అందించారు. రామ్‌నగర్‌కు చెందిన గుంటి ధనలక్ష్మి బీఎస్సీ నర్సింగ్ చదువు కోసం రూ.30 వేలు, నెహ్రూనగర్‌కు చెందిన ఎం.మధుమతి ఇంటర్ ఫీజు నిమిత్తం రూ.12 వేలు, ఏకలవ్యనగర్‌కు చెందిన పేరం అర్చన డిగ్రీ ఫీజు చెల్లించేందుకు రూ.10 వేల చొప్పున అందించారు.

గ్రామాల అభివృద్ధికి సహకారం



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ

చీమకుర్తి: మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి మండల పరిషత్ నిధులతో తన వంతు సహకారం అందిస్తానని ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు స్థానిక ప్రజాప్రతినిధులకు భరోసా ఇచ్చారు. మంగళవారం చీమకుర్తిలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావుతో పాటు వైస్ ఎంపీపీలు జ్యేష్ఠ శ్రీనివాసరావు, రావి లక్ష్మయ్య, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీడీఓ బీజే వండర్‌మ్యాన్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అవసరమైన చోట సైడు కాలువలు, సిమెంట్ రోడ్లు నిర్మాణానికి ప్రతిపానలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

పాల కేంద్రం మాజీ అధ్యక్షుడు మృతి

మద్దిపాడు: పాల కేంద్రం మాజీ అధ్యక్షుడు ఉప్పుగుండూరి లక్ష్మీనారాయణ సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారు. మద్దిపాడు మాజీ సర్పంచ్ ఉప్పుగుండూరి నాగేశ్వరరావు తండ్రి. ఆయన మరణ వార్తను తెలుసుకున్న మాజీ సర్పంచ్ బత్తిన సురేంద్ర బాబు, సీపీఎం నాయకులు షేక్‌మాబు, కాలం సుబ్బారావు ఉబ్బా ఆదిలక్ష్మి, కనపర్తి సుబ్బారావు, ఉబ్బా వెంకటేశ్వర్లు తదితర నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

సీఎం జగన్ మోహన్‌రెడ్డిని విమర్శించటం సిగ్గుచేటు


మాట్లాడుతున్న చంద్రశేఖర్

చీమకుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టీడీపీ నాయకులు విమర్శించటం సిగ్గుచేటని పేర్నమిట్ట 40వ డివిజన్ కార్పొరేటర్ టి.చంద్రశేఖర్ మంగళవారం జరిగిన సమావేశంలో అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నూతన గృహ ప్రవేశానికి హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్


నూతన గృహంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

మద్దిపాడు: మండల కేంద్రానికి చెందిన కాకుమాను కోటేశ్వరరావు నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరై అభినందనలు తెలిపారు. చీమకుర్తి బీవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పని చేస్తున్న కోటేశ్వరరావు ఆహ్వానం మేరకు విచ్చేసి.. కొద్ది సేపు ముచ్చటించారు.

జగనన్న లేఅవుట్లలో విద్యుత్ కాంతులు


జగనన్న లేఅవుట్లలో వీధి దీపాలు

ఒంగోలు రూరల్: జగనన్న లేఅవుట్లలో విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి. తాగునీరు, రోడ్ల వసతి, మెరక చేయడం, నీటి వసతితో పాటు రూరల్‌లోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం ఐరన్ రాడ్స్ కటింగ్, వెల్డింగ్ వర్క్, గోడలకు నీటి క్యూరింగ్ అవసరాల నిమిత్తమే లబ్ధిదారులు విద్యుత్ సౌకర్యాన్ని ఉపయోగించుకున్నారు. రీజనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు వీధి దీపాలు ఏర్పాటు చేసి ప్రత్యేక లైన్ ఏర్పాటు చేశారు. ఏఈ చెన్నారెడ్డి గత మూడు రోజులుగా ప్రత్యేక లైన్ ఏర్పాటు చేశారు. కరవదిలోని 5 లే అవుట్లలో వీధి దీపాలు వెలుగుతున్నాయి.

ఏపీ జేఏసీ అమరావతి క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఏపీ జేఏసీ అమరావతి 2023 నూతన క్యాలెండర్‌ను కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రకాశం భవనంలోని ఆయన చాంబర్‌లో మంగళవారం ఆవిష్కరించారు. అసోసియేషన్ నాయకులు, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. దీనిలో అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఆర్‌వీఎస్ కృష్ణమోహన్, జనరల్ సెక్రటరీ కె. వెంకటేశ్వర్లు, నాయకులు గోపాల్ రెడ్డి, భూపాల్, రవి, అజయ్‌కుమార్, శివకుమార్ రెడ్డి, ఇస్సాక్, బ్రహ్మం, ఆంజనేయులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీల్లో సాయిబాబా విద్యార్థుల సత్తా

ఒంగోలు: రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో సాయిబాబా సెంట్రల్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీవరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో సాయిబాబా సెంట్రల్ స్కూలు విద్యార్థులు పాల్గొని తృతీయ స్థానంలో నిలిచి షీల్డు, కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. అండర్ 14 విభాగంలో వి.నైమిక, డి.అద్వైత, అండర్ 17 విభాగంలో బి.వేణుగోపాల్, యజ్ఞ సూర్యలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జీవీ భాస్కర్, ప్రిన్సిపాల్ మహేష్, జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ సుబ్బారావు అభినందించారు.

చిన్నారులకు టైఫాయిడ్ వ్యాక్సిన్


వ్యాక్సిన్ వేస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ సిబ్బంది

ఒంగోలు: రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చిన్నారులకు టైఫాయిడ్ వ్యాక్సిన్ కార్యక్రమం మంగళవారం స్థానిక మాంటిస్సోరీ స్కూలులో జరిగింది. రెడ్ క్రాస్ చైర్మన్ ప్రకాష్‌బాబు మాట్లాడుతూ ప్రాణాంతకమైన టైఫాయిడ్ బారిన పడకుండా ఈ వ్యాక్సిన్ రెండు సంవత్సరాల వరకు పిల్లలకు రక్షణ కలిస్తుందన్నారు. రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకృష్ణ మాట్లాడుతూ టైఫాయిడ్ జ్వరం బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. దీనివల్ల దీర్ఘకాల అస్వస్థత, వినికిడి కోల్పోవడం, జుట్టు రాలిపోవడం వంటి రుగ్మతలు మాత్రమే కాకుండా కొన్నిసార్లు ప్రాణాలకు కూడా ముప్పు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాక్సిన్ వేసుకున్న 14 రోజుల నుంచి 2 సంవత్సరాలవరకు రక్షణ లభిస్తుందన్నారు. నగరంలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లోని చిన్నారులకు వ్యాక్సిన్ అందిస్తామని రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి తెలిపారు. మాంటిస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ శబరీనాథ్, ప్రిన్సిపాల్ నూరుద్దీన్, వైస్ ప్రిన్సిపాల్ నరేష్, బటర్‌ఫ్లై స్కూల్ డైరెక్టర్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం


రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభం

దొనకొండ: స్థానిక వీవీపురంలో రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం ఉండటంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అదే వీధిలో పోలేరమ్మ దేవస్థానం ఉండటంతో భక్తులు నిత్యం అమ్మవారి దర్శనానికి వెళ్తుంటారు. ఈ మధ్య కాలంలో దాతల సహకారంతో గుడిని అభివృద్ధి చేశారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, నాలుగు చక్రాల వాహనాలు విద్యుత్ స్తంభం వద్ద ఆగాల్సి వస్తోంది. ప్రయాణికులు అక్కడి నుంచి నడిచి వెళ్తున్నారు. ఎన్నిసార్లు చెప్పినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి


వరి పైరును పరిశీలిస్తున్న ఏఓ జైనులుద్దీన్

పొదిలి రూరల్: రైతులు తప్పని సరిగా తమ పంటలకు ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి జైనులుద్దీన్ సూచించారు. మంగళవారం పొదిలి మండలం ఏలూరు, తలమళ్ల, ఉప్పలపాడు గ్రామాల్లో సాగు చేసిన వరి పైరును ఆయన పరిశీలించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల్లో రైతులతో మాట్లాడారు. మండలంలో 3,321 మంది రైతులు 9,132 ఎకరాల్లో పలు పంటలు సాగు చేశారన్నారు. బొబ్బర్లు 5,782 ఎకరాలు, పొగాకు 1,340 ఎకరాలు, మినుము 1,017 ఎకరాల్లో సాగు చేశారన్నారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతూ ఆర్బీకేల్లో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

వైభవంగా అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం


పూజలు చేసి ఊరేగింపుగా వస్తున్న దంపతులు


నిప్పులు గుండంలో నడుస్తున్న మహిళా భక్తురాలు

చీమకుర్తి: శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ వేడుకలు ఈనెల 17 నుంచి 24 వరకు సంతనూతలపాడులోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి 38 మంది దంపతులు కలశాలతో విశేష పూజలు చేసి ఊరేగింపుగా శివాలయంలో పూజలు నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నిప్పుల గుండంలో స్థానిక మహిళా భక్తులతో పాటు ఇతర భక్తులు ఉత్సాహంగా అత్యంత భక్తిప్రపత్తులతో నడుచుకుంటూ అమ్మవారి పట్ల తమ భక్తిభావం చాటుకున్నారు. సత్తెనపల్లికి చెందిన పీఠాదిపతి కే.రాజా గురువు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.


అమ్మవారికి 38 కలశాలతో పూజలు చేస్తున్న దంపతులు

రెండిళ్లలో చోరీ


బీరువాలో చెల్లాచెదురుగా పడి ఉన్న చీరలు

మార్కాపురం టౌన్: తాళం వేసిన రెండు ఇళ్లను టార్గెట్‌గా చేసుకున్న దొంగలు సోమవారం రాత్రి కంభం రోడ్డులోని శ్రీనివాస థియేటర్ పక్క సందులో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలు మంగళవారం వెలుగులోకి వచ్చాయి. బంధువుల ఇంటికి వెళ్లిన కురిచేటి సుజాత ఇంటి బీరువా తాళాలు పగులగొట్టి రూ.3 వేల నగదు, రెండు పట్టుచీరలు, మారంరెడ్డి సరస్వతి ఇంట్లో రూ.10 వేల నగదు చోరీకి పాల్పడినట్లు బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

చెన్నకేశవుని హుండీ ఆదాయం రూ.8.59 లక్షలు

మార్కాపురం టౌన్: శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి వారి హుండీ ఆదాయాన్ని లెక్కించగా 8,59,789 రూపాయలు వచ్చినట్లు చైర్మన్ పి.కేశవరావు, ఈవో జి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. నాలుగు నెలల ఆదాయం లెక్కించినట్లు పేర్కొన్నారు. ధర్మకర్త సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.